ఈనాడు చిత్తూరు

80 హెక్టార్లలో దెబ్బతిన్న వరి, వేరుసెనగ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో 14 మండలాల్లో 161 మంది రైతులు సాగు చేసిన 73 హెక్టార్లలో వరి పంట నేలవాలింది. ఏడు హెక్టార్లలో వేరుసెనగ పంట దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

మామిడికి అనుకూలం.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడి పంటకు చాలా అనుకూలమని ఉద్యానశాఖ డీడీ మధుసూదనరెడ్డి చెప్పారు. ఈ వర్షాలు తేనెమంచు పురుగు నివారణకు ఉపయుక్తమన్నారు. సూర్యరశ్మి లేక కొంతమేర టమాటా, బంగాళాదుంప, చామంతి తదితర పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతులు జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని చెప్పారు. టమాటాలో అగ్గితెగులు సహా చీడపీడలు ఆశించకుండా క్లోరోథలోమి, మ్యాంగోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలన్నారు. బంగాళదుంప పూత దశలో ఉన్నందున అగ్గితెగులు రాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు.



చౌడేపల్లె మండలంలో దెబ్బతిన్న టమాటా పంట

35 ఎకరాల్లో టమాటా..

చౌడేపల్లె, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో టమాటా పంట 35 ఎకరాలు, బీర, కాకర పంటలు నాలుగు ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఉద్యానశాఖ డీడీ మధుసూదనరెడ్డి తెలిపారు.

విజయపురంలో 60.2 మి.మీ. వర్షపాతం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం జిల్లాలోని 22 మండలాల్లో భారీ నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురం మండలంలో 60.2 మి.మీటర్లు, అత్యల్పంగా గుడిపాలలో 0.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నింద్రలో 30.4, కార్వేటినగరం 14, నగరి 13.8, సదుం 12.4, సోమల 10.4 మి.మీ. కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

వలస జీవనం.. విలాస భవనం

➡ ఇదీ.. తిమ్మరాజుపల్లె కష్టజీవుల ప్రత్యేకం

ఆదివారం ప్రత్యేకం

మారుమూల అటవీ ప్రాంతంలోని కుగ్రామంలో వంద కుటుంబాలు.. ఒకే కులస్థులు.. నిత్యం కష్టపడితేనే కుండగాలి.. లేకుంటే ఎండగాలి.. అన్న సామెతలా బతుకులు సాగిస్తున్న ప్రజలు.. రెక్కల కష్టార్జితంతో విలాస జీవనాన్ని సాకారం చేసుకొంటున్నారు. కేరళ తరహాలో డూప్లెక్స్ ఇళ్లు.. అధునాతన సౌకర్యాలతో రూపుదాల్చిన ఆ ఊళ్లోకి ఇతరులెవరైనా వెళ్లగానే.. నిజంగా ఇది వలసల గ్రామమేనా.. అని ఒకింత సందేహానికి గురి కావాల్సిందే.



డూప్లెక్స్ నివాసాలు

జిల్లాలో తమిళ, కన్నడ రాష్ట్రాల సరిహద్దుల నడుమ.. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో వలస గ్రామాలున్నాయి. శాంతిపురం మండలంలోని తిమ్మరాజుపల్లెలోనూ ఇంటింటా వలస బతుకులే. దాదాపు రెండు వందల ఏళ్ల కిందట ఏర్పాటైన గ్రామంలో వ్యవసాయేతర కుటుంబాలే అధికం. తరతరాలుగా రాతి, మట్టి పనులకు అలవాటుపడిన ప్రతి కుటుంబంలోనూ వలస జీవనాలు సాగిస్తున్నారు. బెంగళూరులో భవన నిర్మాణ పనులు, మట్టి తవ్వకాలతో దశాబ్దాల తరబడి జీవనాలు సాగిస్తున్న కష్టజీవులకు స్వగ్రామంపై మమకారం పోలేదు. ఏడాదంతా పొరుగు రాష్ట్రంలో పొట్టకూటి కోసం కష్టాన్ని ఇష్టపడినా.. పండుగలు, వేడుకలకు సొంతూళ్లలో వాలిపోతుంటారు.



తిమ్మరాజుపల్లెలో విలాస భవనం



గ్రామస్థులు నిర్మించుకున్న ఆలయం

అందాల భవంతులు.. అధునాతన వసతులు

రెక్కల కష్టం సంపాదనతో చక్కటి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కేరళ తరహాలో డూప్లెక్స్ భవంతులు చూడచక్కని అందాలతో రూపుదిద్దుకున్నాయి. నగరాలను తలపించే విధంగా అధునాతన హంగులు, సకల సౌకర్యాలతో కూడిన బహుళ అంతస్తుల భవనాలు వారి సొంతం. దాదాపు 25 కుటుంబాలకు కార్లు సైతం ఉన్నాయి. కన్నవారి కష్టంతో చదువులను ఇష్టపడిన పలువురు యువకులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు.

రూ.50 లక్షలతో ఆలయం

గ్రామస్థుల సమష్టి కష్టంతో చక్కటి ఆలయాన్ని నిర్మించుకున్నారు. దాదాపు రూ.50 లక్షలతో రూపుదిద్దుకున్న ప్రసన్న గంగమాంబ ఆలయంలో ఏటా జాతర మహోత్సవాలకు వలస జనమంతా తరలి వచ్చి.. రూ.లక్షల ఖర్చుతో పూజలు, వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.


\- న్యూస్‌టుడే, శాంతిపురం

చిలకమ్మా.. స్నేహం బాగుందమ్మా



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ భుజంపై రామచిలుక

తిరుపతిలోని గాలి వీధిలో నివాసం ఉండే సరళ రామచిలుకతో స్నేహం చేస్తోంది. తను ఎక్కడికెళ్లినా చిలుకను వెంట తీసుకెళ్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆరు నెలల క్రితం చెట్టుపై నుంచి పడిన చిలుకను సంరక్షిస్తూ దానికి పేరు పెట్టి బాగోగులు చూసుకుంటోంది. ఇంట్లో తినే ఆహార పదార్థాలను ఆహారంగా అందిస్తున్నామని చెబుతున్నారు సరళ. శీతల పానీయం తాగుతుంటే ఆమె నోటి నుంచి చిలుక తాగడం, ఆమెను ఇతరులు తాకే ప్రయత్నం చేస్తే కొరకడానికి వస్తూ ఆకట్టుకుంటోంది. - ఈనాడు, తిరుపతి



సరళతో పాటు శీతల పానీయం తాగుతూ..

కైలాసకోన కనువిందు

తాజా వర్షాలకు కోనల్లో జలపాతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో చాలా కోనలకు పర్యాటకులను అనుమతించడం లేదు. నారాయణవనం మండలం కైలాసకోన జలపాతానికి అనుమతించడంతో ఆహ్లాదం పొందుతున్నారు. పచ్చని చెట్ల నడుమ కొండపై నుంచి జాలువారే జలపాతం ఆకట్టుకుంటోంది. ప్రకృతి ఒడిలో జలపాత సౌందర్యాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక తమిళనాడు నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.



\- న్యూస్‌టుడే, నారాయణవనం



ఊడల మర్రి.. ఊసులినాల్సిందే

ఒకటిన్నర ఎకరంలో విస్తరించిన 400 ఏళ్ల క్రితం నాటి ఈ ఊడల మర్రి ఊసులు వినాల్సిందే. ఈ చెట్టు ఏ అభయారణ్యంలోనో కాదండోయ్.. పాలసముద్రం మండలంలోని రాచపాళ్యం గ్రామంలోనిది. తరాలు మారుతున్నా ప్రకృతి అవాంతరాలను తట్టుకుని ఇంకా స్థిరంగా నిలబడే ఉంది. గుబురుగా పెరిగిన ఈ కొమ్మలు ఇటుగా వెళ్లేవారికి పచ్చటి పరిమళాలు వెదజల్లుతూ.. వర్షంలో గొడుగు పడుతోంది. ఈ చెట్టు నిండా అల్లుకున్న ఊడలు పిల్లలకు ఆటలాడుకునే ఉయ్యాలలవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ మర్రి మొదట్లో ఏకశిల బాలగురునాథీశ్వర స్వామిని ప్రతిష్ఠించడం విశేషం.

\- న్యూస్‌టుడే, పాలసముద్రం

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శనివారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. శుక్రవారం శ్రీవారిని 61,576 మంది దర్శించుకోగా రూ.3.54 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



ద్రవిడ పునర్వైభవమే ధ్యేయంగా!

- ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు
- నేటితో 27వ వసంతంలోకి విశ్వవిద్యాలయం



ఈనాడు, చిత్తూరు: కుప్పం గ్రామీణం: త్రిరాష్ట్ర కూడలి కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం వైకాపా హయాంలో భ్రష్టు పట్టింది. ప్రశాంత వాతావరణానికి నెలవైన వర్సిటీలో రాజకీయాలు ప్రవేశించాయి. హేతుబద్ధీకరణ పేరుతో విశ్వవిద్యాలయంలో కీలకమైన ప్రసారంగ విభాగాన్ని మూసేశారు. ఒకానొక సందర్భంలో ఒప్పంద సిబ్బందికి జీతాలు ఇవ్వలేక విద్యార్థుల పరీక్షలు వాయిదా వేసిన అవమానకర పరిస్థితి ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడం, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్‌ను నియమించడంతో వర్సిటీ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. విశ్వవిద్యాలయం స్థాపించి నేటితో 26 ఏళ్లు పూర్తై 27వ వసంతంలోకి ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో వర్సిటీలో జవసత్వాలు నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ద్రవిడ వర్సిటీ ప్రారంభించిన సమయంలో రెండే కోర్సులు ప్రవేశపెట్టారు. అప్పట్లో 200 వరకు ప్రవేశాలు ఉన్నాయి. అనంతరం వర్సిటీలో సీటు కావాలంటే సిఫార్సు లేఖలు తెచ్చినా దొరికే పరిస్థితి లేదు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)ను ఇక్కడే అందుబాటులోకి తెచ్చారు. ఇలా వినూత్న పద్ధతులు అవలంబించారు.

యూజీసీ నిబంధనలను పక్కనపెట్టి 2007-09 సంవత్సరాల్లో దూరవిద్య విధానంలో పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించి అపఖ్యాతి మూటగట్టుకుంది. అప్పటినుంచి ప్రవేశాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ పెంచేందుకు ఇన్‌ఛార్జి వీసీ, రిజిస్ట్రార్‌లు ఆచార్య దొరస్వామి, కిరణ్‌కుమార్, వర్సిటీ యంత్రాంగం ప్రయత్నిస్తోంది.

ఇంతలోనే ఎంత తేడా

వైకాపా హయాంలో ప్రవేశాలు అట్టడుగుకు చేరగా.. కూటమి ప్రభుత్వం మార్పు తెస్తుందన్న నమ్మకంతో ఈ ఏడాది ప్రవేశాలు అమాంతం పెరిగాయి. గతేడాది డిగ్రీ, పీజీలో కలిపి 250 ప్రవేశాలు రాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 450కు చేరింది. ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 20కుపైగా పీజీ కోర్సులు, 1,800 వరకు విద్యార్థులున్నారు.

ఉద్యోగుల కష్టాలు తీరేలా..

వైకాపా హయాంలో 250 మంది ఒప్పంద ఉద్యోగులు, సిబ్బందికి 13 నెలలు జీతాలు చెల్లించలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.2.86 కోట్లు విడుదల చేసి ఆరు నెలల వేతనాలు ఇచ్చారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలనే యోచనలో వర్సిటీ అధికారులున్నారు. అకడమిక్ కన్సల్టెంట్ల వేతనాలను సైతం రూ.6వేలు- రూ.12వేలు ప్రస్తుత ప్రభుత్వంలోనే పెంచారు. ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, బకాయిలు కూడా విడుదల చేశారు. ఉద్యోగోన్నతుల అంశంలో నెలకొన్న వివాదాలనూ పరిష్కరిస్తున్నారు. నీట్, గేట్ వంటి పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు టీసీఎస్- డిజిటల్ అయాన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నారు.

నిధుల కొరత తీర్చేందుకు..

- ఎస్వీ, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంతో పాటు ద్రవిడకు తితిదే ఏటా నిధులు ఇస్తోంది. ఏటా రూ.50 లక్షలు మంజూరు చేస్తుండగా వినియోగ ధ్రువపత్రాలు ఇవ్వనందున రెండేళ్లుగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వాటిని రప్పించేందుకు కృషి చేస్తున్నారు. అదనంగా మరో రూ.50 లక్షలు ఇవ్వాలని అభ్యర్థించారు.
- రూ.10 కోట్ల రూసా నిధులతో 30 తరగతి గదులు, రూ.2.50 కోట్లతో బాలుర వసతిగృహం నిర్మించారు.
- విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చినందున ఇది కూడా సాకారం కానుంది.

'అనుబంధ' కళాశాలల దిశగా

జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక్క ద్రవిడ విశ్వవిద్యాలయం మాత్రమే ఉంది. ఎస్వీ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కళాశాలలున్నాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ద్రవిడకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే చంద్రబాబు ఈ విషయమై సానుకూలంగా స్పందించారు.

కాలం చెల్లిన చెక్కీలిస్తారా..?

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనంలో కాలం చెల్లిన చిక్కీలు విద్యార్థులకు ఎలా ఇస్తారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మజ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందజేస్తున్న చిక్కీల ప్యాకెట్‌పై తయారీ తేదీ చూసి ఆశ్చర్యపోయారు. ఎప్పుడో తయారుచేస్తే ఇప్పుడెలా విద్యార్థులకు ఇచ్చారని మండిపడ్డారు. కాలం చెల్లిన వాటిని గుర్తించి పిల్లలకు ఇవ్వకుండా భద్రపరిచామని ప్రధానోపాధ్యాయిని పుర్వాణి వివరణ ఇచ్చారు. పాఠశాల భవనాలపై పెరిగిన మొక్కలు తొలగించాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మజ

బియ్యం కార్డుదారులకు జొన్నలు

చిత్తూరు(మిట్టూరు): బియ్యం కార్డుదారులకు జొన్నల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైకాపా హయాంలో బియ్యం ఒక్కటే పంపిణీ చేశారు. చక్కెర అరకొరగా.. కందిపప్పు నెలల తరబడి పంపిణీకి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన దిశగా తీసుకెళ్తూ బియ్యం, చక్కెర, కందిపప్పు అందజేస్తోంది. ఇందులో భాగంగా పోషకాహారమైన జొన్నరొట్టె తయారీకి ఉపయుక్తంగా చర్యలు తీసుకోనుంది. జిల్లాలో 1,379 చౌక దుకాణాల ద్వారా ప్రతి నెలా 5.43 లక్షల మంది బియ్యం కార్డుదారులకు సరకుల పంపిణీ జరుగుతోంది. నవంబరు నెల కోటాలో జొన్నల పంపిణీకి ప్రభుత్వం జిల్లాకు 300 టన్నులు కేటాయించింది. కార్డుకు 1-3 కిలోల చొప్పున అందజేయనున్నట్లు సమాచారం.





టెట్‌కు 399 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్‌కు శనివారం 399 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 460 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 61మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో 200మందికి.. 178మంది, పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాలలో 260 మందికి. . 221 మంది హాజరయ్యారు.

భళా యువ..

ప్రతిభ చూపి.. పతకాలు సాధించి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు మహనీయులు. యువతలో జాతీయ భావాల్ని పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాల్ని అమలు చేస్తోంది ప్రభుత్వం. నెహ్రూ యువ కేంద్ర కళాశాల విద్యార్థులకు యువ ఉత్సవ్ పోటీలు నిర్వహించి ప్రతిభగల యువతకు వేదికను అందిస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న యువత.. జిల్లా స్థాయి పోటీల్లో తమ ప్రతిభతో మెరిశారు. రాష్ట్ర స్థాయి యువ ఉత్సవ్ పోటీల్లోనూ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పతక చిత్రం..

చరవాణి ప్రపంచాన్ని అరచేతిలో చూపెడుతోంది. చరవాణి ద్వారా ఫొటోగ్రఫీలో నైపుణ్యాన్ని సాధించారు చిత్తూరు నగరానికి చెందిన సూర్య. ఎంబీఏ చదువుతున్న ఈ యువకుడికి ఫొటోలు తీయడమంటే ఎంతో ఇష్టం. మన దేశ సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యమున్న ప్రదేశాలు, ప్రకృతి అందాల్ని కెమెరాలో బంధించి సరదాగా ఫొటోలు తీస్తుంటాడు. అలా తాను తీసిన ఫొటోతో యువ ఉత్సవ్‌లో ఎంట్రీకి పంపాడు. అనుకోకుండా తీసిన ఫొటోలతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. వ్యాపారవేత్తగా స్టార్టప్‌ను నెలకొల్పి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం తన లక్ష్యమని అంటున్నాడు సూర్య.

దేశం కోసం మనమేం చేస్తున్నాం..



వక్తృత్వ పోటీలు వ్యక్తిలోని ఆలోచనల్ని వెలికితీస్తాయి. మాటలు అందరూ మాట్లాడతారు. తోటివారిని ఆకట్టుకునేలా, ఆలోచన రేకెత్తించేలా కొందరే మాట్లాడగలరు. దేశం నాకేమి ఇచ్చింది అని కాకుండా.. దేశం కోసం మనం ఏమి చేయాలి అనే భావనను వ్యక్తపరచి స్వర్ణ పతకాన్ని సాధించింది సోనీ. ఐరాల మండలం పి.ఎర్రేపల్లెకు చెందిన ఈ యువతి.. చిత్తూరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. దేశ చరిత్ర, భావితరాల కోసం ప్రస్తుత మనం ఎలా జీవించాలి, ఆర్థికంగా ఎలా ఎదగాలి, యువతకు ఉపాధి అవకాశాలు.. అంశంపై తన గళాన్ని స్పష్టంగా వినిపించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం తన ఆశయం అంటోంది సోనీ.



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి

ప్రతి సేవలు యాప్‌లలో నమోదు చేయండి

చిత్తూరు (వైద్యవిభాగం): జిల్లాలోని పీహెచ్‌సీల్లో ప్రజలకు అందించే ప్రతి వైద్య సేవ ఆన్‌లైన్ యాప్‌ల్లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి ఆదేశించారు. ఆమె శనివారం జూమ్‌లో వైద్యాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లోని ప్రసూతి విభాగంలో తల్లి, పుట్టిన బిడ్డకు సేవలతో పాటు అన్ని వ్యాధి నిరోధక టీకాలు అందిస్తారని, వాటినీ యూవిన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్(ఐహెచ్‌ఐపీ) కింద జరిగే అన్ని రకాల ఓపీ సేవలు, రక్త పరీక్షలు, క్షేత్రస్థాయిలో సిబ్బంది సేవలు సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తద్వారా ఎక్కడ ఏ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి.. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చనేది తెలుస్తుందన్నారు. జిల్లా టీకాల అధికారి హనుమంతరావు, శిరీష, శ్రీవాణి పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో సినీ దర్శకుడు శ్రీను వైట్ల



ఆలయంలో శ్రీను వైట్ల

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని సినీ దర్శకుడు శీను వైట్ల, నిర్మాత వేణు దోనేపూడి శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం సూపరింటెండెంట్ కోదండపాణి, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ ఉన్నారు.

24 నుంచి కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులతో సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 7న అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు. పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	195

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య



తేజేశ్వరరెడ్డి (పాత చిత్రం)

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: తిరుపతి నగరం పంట వీధికి చెందిన తేజేశ్వరరెడ్డి (35) ఓ ప్రైవేటు మెడికల్ సంస్థలో థెరపీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. శనివారం చిత్తూరు వచ్చిన అతడు మెసానికల్ మైదానం సమీపంలో రైలు పట్టాలపైకి వెళ్లాడు. ఆ సమయంలో కోయంబత్తూరు-తిరుపతి ఇంటర్‌సిటీ రైలు వస్తుండగా పరుగెత్తి పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వగా జీఆర్‌పీఎఫ్ అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ వాలంటీరుపై పోక్సో కేసు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: మాజీ వాలంటీరు ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఇతని తండ్రి వైకాపా నేత కావడంతో రెండు రోజుల పాటు రాజీయత్నాలు చేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. శాంతిపురం మండలంలోని శెట్టిగానికురుబూరుకు చెందిన వైకాపా నాయకుడు మునెప్ప కుమారుడు మాజీ వాలంటీరు వెంకటాచలం.. ఓ బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై శనివారం పోక్సో యాక్టు నమోదు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులను సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ గిరింపేట, కట్టమంచి ఉప కేంద్రాల పరిధిలో లైన్ల మరమ్మతు కారణంగా ఆదివారం సరఫరా నిలిపివేయనున్నామని ఈఈ మునిచంద్ర శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని గిరింపేట, గొడుగుమూరు, బాలాజీనగర్‌కాలనీ, రామనగర్‌కాలనీ, దుర్గానగర్ కాలనీ తదితర ప్రాంతాలు, కొంగారెడ్డిపల్లె సెక్షన్‌లో కట్టమంచి, లాయర్స్ కాలనీ, ఆర్టీసీ బస్టాండు, గురునగర్‌కాలనీ, కొంగారెడ్డిపల్లె మెయిన్ రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డు, బీవీరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సర్వజీవుల సేవే సర్వేంద్రుడి సేవ

పుత్తూరు: ఎదుటివారి బాధ మీదే అనుకుంటే అక్కడే దేవుడుంటాడని ఎస్వీ యూనివర్సిటీ తెలుగు రీసెర్చ్ స్కాలర్ గరికపాటి రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి విశ్రాంత జూనియర్ వెటర్నరీ అధికారి మునిరాజులుశెట్టి రూ.50 వేలు విరాళం అందజేశారు. సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రాజు, ఆదిరే కృష్ణస్వామి, విశ్రాంత ఉద్యోగులు మనోహరనాయుడు, గుణశేఖర్ రెడ్డి, కృపావరమ్మ, యుగంధర్‌రెడ్డి, కుప్పయ్య, రామలింగం, రామమూర్తి, చంద్రశేఖర్‌వర్మ, వెంకటకృష్ణమనాయుడు, చిరంజీవులు, బాలసుబ్రహ్మణ్యం, నారాయణరావు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు విన్నవించానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో.. తాజాగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశం సందర్భంగా సీఎంను, సంబంధిత శాఖల మంత్రులను కలిసి విన్నవించానని చెప్పారు. చిత్తూరు గ్రామీణ, గుడిపాల మండలాల పరిధిలో రైతుల కోసం చెరువుల నిర్వహణకు చర్యలు చేపట్టాలని, చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణంపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. ఫలితంగా వర్షపు నీటిని నిల్వ చేసే సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. ఈ రెండు మండలాల్లో 280 చెరువుల మరమ్మతులు, నిర్వహణ, నూతన చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.33.44 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు సిద్ధం చేశారని వివరించారు. చిత్తూరు నగరంలోని నీవా నది ఆధునికీకరణ కోసం రూ.175 కోట్లు మంజూరు చేయాలని, 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం చిత్తూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు నీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద మంజూరు చేసిన పనులు 75 శాతం పూర్తి చేసినా, అనంతరం వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అడవిపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైన్ల పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం రూ.11.50 కోట్లు, చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటు, చెన్నై, బెంగళూరు జాతీయ రహదారి సమీపంలో చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, టూరిజం, హెల్త్ కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరగా, సీఎం సహా మంత్రులు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల వివరాలు తెలపండి

నగరి: 2011 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ వివరాలను నగరి విశ్రాంత ఉద్యోగుల సంఘంకు తెలపాలని, ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత తాము తీసుకున్న కమ్యూటేషన్ మొత్తాన్ని 15 ఏళ్ల వరకు నెలనెలా మినహాయిస్తున్నారని, మిగిలిన రాష్ట్రాలలో 12 నెలలు మాత్రమే మినహాయిస్తున్నారని, ఇదే విధానం మన రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు కల్పించాలనే అంశపై ఈ నెల 27న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నగరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

దోమలు బాబోయ్.. దోమలు

☛ కాలువలు, నీటి గుంతల్లో విజృంభణ ☛ కానరాని ఫాగింగ్, మలాథియాన్ పిచికారీ ☛ పెరుగుతున్న జ్వర బాధితులు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలతో నగర ప్రజలకు కంటి నిండా నిద్ర కరవైంది.. దోమకాటుతో పిల్లల నుంచి పెద్దలు వివిధ రకాల జ్వరాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు.. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా నగరంలోని ఆస్పత్రులు సైతం జ్వర బాధితులతో నిండిపోతున్నాయి.. వర్షాలు కురుస్తుండటంతో కాలువలు, మురుగునీటి గుంతల్లో దోమలు, కీటకాల బెడదతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన నగరపాలక ప్రజారోగ్య విభాగం నిద్దరోతోంది.

దోమల దండయాత్ర..

నగరంలో సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇక ప్రజలపై దోమల దండయాత్రే ప్రారంభమవుతుంది. ఆయా డివిజన్లలో డ్రైనేజీ కాలువలు, ఖాళీ స్థలాల్లోని మురుగునీటి గుంతల నుంచి దోమలు వేల సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, వైరల్ తదితర విషజ్వరాలకు కారణమయ్యే దోమల సంఖ్య వర్షాలతో ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. నగరం నడిబొడ్డున అభివృద్ధి చెందిన కాలనీల నడుమ ఖాళీ స్థలాల్లో ఏర్పడిన పెద్ద పరిమాణంలోని నీటి గుంతలను దోమలు ఆవాసంగా మార్చుకుని స్థానికులను కుట్టేస్తున్నాయి. నగరంలో కాలువలు, వీధుల్లో చెత్త వ్యర్థాలతో పాటు మురుగునీటి గుంతలు స్థానికులకు సంకటంగా మారాయి. ఈ గుంతలను పూడ్చాలని నగరపాలక సంస్థ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం శూన్యమని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కట్టమంచిలో నివాసాల ఎదుట మురుగునీటి కాలువ దుస్థితి

నివారణ చర్యలు శూన్యం..

నగరంలో దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా సాగుతోంది. తమ ప్రాంతాల్లో నెలల తరబడి ఫాగింగ్ చేయడం లేదంటూ ఆయా కాలనీల వాసులే చెబుతున్నారు. దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండే మురుగునీటి గుంతల్లో నూనె బంతులు విసరడం, మలాథియాన్ పిచికారీ సక్రమంగా సాగడం లేదు. ప్రజారోగ్య విభాగం ద్వారా నగరంలో ఫాగింగ్ కోసం రూపొందించిన ప్రత్యేక షెడ్యూలు కాగితాలకే పరిమితమైంది. ఫాగింగ్ చేయడానికి అవసరమైన యంత్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. ప్రజారోగ్యంపై నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న కాలనీల్లోనే దోమల బెడద ఇలా ఉంటే.. ఇక శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించి దోమల నివారణకు ఫాగింగ్, నివారణ మందుల పిచికారీ చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు విన్నవిస్తున్నారు.



గిరింపేట గొడుగుమూరులో మురుగునీటి గుంత

ఫాగింగ్ చేయిస్తాం..

నగరంలోని దోమల నివారణకు చర్యలు చేపడతాం. దోమల ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. తద్వారా జ్వరాలు రాకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

-అనిల్‌కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

'ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్న జగన్'

చిత్తూరు(జిల్లా పంచాయతీ): వైకాపా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నాడని తెదేపా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ ఆరోపించారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ సీఎంగా ఉన్నప్పుడు దశలవారీ మద్య నిషేధం చేస్తామని మహిళలకు హామీనిచ్చి నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే జగన్‌కు భవిష్యత్తులో ఎమ్మెల్యే హోదా ఉండదని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు గోపాల్, యువరాజు, ధరణిప్రకాష్, సురేష్, కరుణాకర్, నాగరాజ్ పాల్గొన్నారు.

పోటీతత్వం అలవరచుకోవాలి



విజేతలతో బృందావన పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని బృందావన పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నగరంలోని బృందావన పాఠశాలలో శనివారం ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు సృజనాత్మకత సరళిలో సమస్య తీవ్రతను చక్కగా విశ్లేషించి రాశారు. జయప్రసూన, లేఖనా, జోత్స్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేథస్సుకు పదును



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

పుత్తూరు, న్యూస్‌టుడే: 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధి గేటు పుత్తూరులోని జడ్పీ తెలుగు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం ఈ పోటీలో పాల్గొని చిట్టిబుర్రలకు పదునుపెట్టారు. ఇంటర్నెట్ వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు విశ్లేషించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేజే వేములు మాట్లాడుతూ ఇలాంటి పోటీలో విద్యార్థులు పాల్గొని తమ మేధస్సుకు పదును పెట్టవచ్చన్నారు. 'ఈనాడు' సంస్థ ఎంతో ముందుచూపుతో విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభిరామి, యువశ్రీ, రామ్‌చరణ్ తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు కేజేవేములు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు శరశ్చంద్రిక, సునీతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాన భవన పనులు వేగవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న ఈవో గురుప్రసాద్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం రూ.3 కోట్లతో అదనంగా తన వసతులతో కూడిన అన్నదాన భవన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఈవో పి.గురుప్రసాద్ సూచించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పనులు పరిశీలించారు. సామూహిక కల్యాణ మండపాన్ని తొలగించి అన్నదాన భవనాన్ని నిర్మిస్తున్నామని, పనుల నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, ఏఈ శివాంజనేయులు ఉన్నారు.

పీవీకేఎన్ కళాశాల మైదానంలో బాణసంచా విక్రయాలు

చిత్తూరు కలెక్టరేట్: దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయాలకు చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ మైదానాన్ని వేదికగా ఖరారు చేశామని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విక్రయాల నిమిత్తం ప్రజల సౌకర్యార్థం పీవీకేఎన్ కళాశాల మైదానాన్ని ఎంపిక చేశామన్నారు. నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక, పోలీసు, నగరపాలక, విద్యుత్తు, మార్కెటింగ్, జలవనరుల శాఖల అధికారులు, బాణసంచా విక్రయ డీలర్లు పాల్గొన్నారు.

కమ్మగుట్లపల్లె ఆలయాభివృద్ధికి ప్రణాళిక



శివం గోయల్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్థులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: కమ్మగుట్టపల్లెలో స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీ సమేత శ్రీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి శ్రీసన్నిధి ఫుడ్స్ కంపెనీ(పేటపల్లె) ముందుకొచ్చింది. కంపెనీ యజమాని శివం గోయల్ దంపతులు ఆలయాన్ని శనివారం దర్శించిన అనంతరం గ్రామస్థులతో సమావేశమై తమ సంస్థ తరఫున ఆలయాన్ని దత్తత తీసుకుని అన్ని హంగులతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయాభివృద్ధికి ముందుకు వచ్చిన శివం గోయల్ దంపతులను గ్రామస్థులు సత్కరించారు.



కళాధర్‌నాయుడుతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

మూడ్రోజుల్లో హోటల్ తొలగించాలి: జేసీ

బంగారుపాళ్యం: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారి బలిజపల్లె సమీపంలోని కళాధర్ హోటల్ తొలగింపునకు మూడ్రోజులు గడువు ఇస్తున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరు, చెన్నై ఆరు వరుసల రహదారి ఏర్పాటుకు భూమితో పాటు హోటల్ భవనానికి 2022లో పరిహారం రూ.4.30 కోట్లు చెల్లించారని, హోటల్ యజమాని కళాధర్‌నాయుడు, ఆయన సోదరుడు చక్రధర్‌నాయుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అదనంగా రూ.5 కోట్లు పరిహారం అందచేయనున్నట్లు జేసీ వివరించారు. హోటల్‌లోని సామగ్రి, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు 15 రోజులు గడువు ఇవ్వాలని యజమానులు జేసీని కోరగా ఆమె ససేమిరా అని మూడ్రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. దీంతో హిటాచీ యంత్రాలతో హోటల్ ఆవరణలో పిల్లర్ల ఏర్పాటుకు గోతిని తవ్వారు. విద్యుత్తు శాఖ ఏడీ కొండయ్య, ఏఈ హేమచంద్ర విద్యుత్తు సరఫరా తొలగింపునకు ఉపక్రమించారు. జేసీ వెంట హైవే అధికారులు, తహసీల్దారు బాబురాజేంద్రప్రసాద్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీనివాసులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు తీగల తొలగింపు

స్పందనకు వందనం

నల్లగాంపల్లె, వెంకటాపురం రహదారి పక్కన పొలాల్లో విద్యుత్తు స్తంభానికి చుట్టిముట్టి ఉన్న విద్యుత్తు తీగలు తొలగించారు. ఇటీవల 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన విద్యుత్తు స్తంభాన్ని అల్లుకున్న తీగలు సమస్య ప్రచురితమవడంతో స్పందించిన ఏఈ హేమచంద్ర సిబ్బంది సహకారంతో తీగలు తొలగించి సమస్య పరిష్కరించారు. దీంతో రైతుల హర్షం వ్యక్తం చేశారు.

-న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

నెల రోజుల్లోగా పూర్తికావాలి..

పాలసముద్రం: ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మాణంలో నాణ్యత లోపిస్తే రాజీపడే ప్రసక్తే లేదని పీఆర్ ఎస్ఈ శంకర్‌నారాయణ హెచ్చరించారు. శనివారం స్థానిక పంచాయతీ పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షలతో చేపట్టిన పనులు తనిఖీ చేశారు. ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో విద్యావతి పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

పెనుమూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రుద్రయ్యనాయుడు అన్నారు. శనివారం పాళ్యం యానాది కాలనీ రోడ్డు పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. మండలానికి రూ.2.4 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. పెనుమూరులో నిర్మించిన సీసీరోడ్డు ప్రారంభించారు. మాజీ సర్పంచి రాజగోపాల్, ఏపీవో గుణశేఖర్, వార్డు సభ్యులు శారద, నాదముని నాయుడు, పంచాయతీ కార్యదర్శులు ప్రభుకిరణ్‌కుమార్ పాల్గొన్నారు. **నిండ్ర:** కావనూరు, శ్రీరామాపురం, నిండ్ర, ఇరుగువాయి పలు పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, రాష్ట్ర తెదేపా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరథవాసు, అప్పయ్య, శివయ్య, విజయ్‌కుమార్, సంపూర్ణమ్మ, పరదేశి, కోటేశ్వరరావు పాల్గొన్నారు. **విజయపురం:** తెదేపా మండల అధ్యక్షుడు రమేష్‌రాజు.. జంబాడ పంచాయతీ చినజంబాడ, కోసలనగరం పంచాయతీ కేశవపురం ఎస్టీ సెంటర్‌లో సీసీరోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఎంపీడీవో రమణప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, ఆంజనేయులు, మాజీ సర్పంచు రవిరాజు, తెదేపా యువ నాయకుడు దామోదర్‌రాజు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** కాటప్పగారిపల్లెలో రూ.5 లక్షల విలువైన సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. తెదేపా మండల క్లస్టర్ అధ్యక్షులు ధరణినాయుడు, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్యదర్శి జనార్ధన్, తెలుగుయువత అధ్యక్షులు రమేష్, నియోజకవర్గ తెలుగుమహిళ కార్యదర్శి దేవయాని పాల్గొన్నారు. **కార్వేటినగరం:** తెదేపా పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు రవి యాదవ్ అన్నారు. కార్వేటినగరంలో రూ.64లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. సర్పంచి ధనంజయవర్మ, కార్యదర్శి నాగరత్నమ్మ, నాయకులు జగన్నాధం, సందాని పాల్గొన్నారు.



నిండ్ర: భూమిపూజలో పాల్గొన్న నాయకులు, అధికారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కోమల, ఉపాధ్యాయులు

ఐరాల, న్యూస్‌టుడే: యాదమరి మండలంలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మహేష్, రెడ్డిప్రసాద్, జీవన్‌సాయి, రోహిత్, రంజిత్ ఎంపికైనట్లు హెచ్ఎం కోమల తెలిపారు. నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. పీఈటీ దేవ, ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్ పాల్గొన్నారు. వీరిని ఎస్ఎంసీ ఛైర్మన్ మహబూబ్‌బాషా అభినందించారు.

చదరంగంలో నగరి విద్యార్థి ప్రతిభ




రిషిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 చదరంగం పోటీలలో నగరి అవర్ లేడీ మెర్సీ పాఠశాల విద్యార్థి ఎం.రిషి ద్వితీయ స్థానం సాధించాడని కరస్పాండెంట్ ప్రభ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అతడిని ఎంపిక చేశారని, పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించామని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు కోచు, పీఈటీ గోపి పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలానికి సర్వే.. నిండ్ర: కెఆర్‌పాళెంలో స్మశాన వాటిక స్థలానికి సంబంధించి సర్వే చేసి ఆక్రమణను తొలగించాలని ఇటీవల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కి స్థానిక తెదేపా నాయకులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన అధికారులను ఆదేశించడంతో శనివారం సర్వే.. మండల సర్వేయర్ వెంకటేశులు సమక్షంలో నిర్వహించారు. గ్రామస్థుల సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

14 మందికి రూ.1.45 లక్షల జరిమానా

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరులో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మందికి రూ.1.45 లక్షల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి తీర్పునిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో పట్టుబడిన 14 మందిపై కేసు నమోదు చేసి శనివారం న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 13 మందికి రూ.10 వేలు చొప్పున, ఓ వ్యక్తి రెండోసారి పట్టుబడటంతో అతడికి రూ.15 వేలు చొప్పున.. 14 మందికి రూ.1.45 లక్షల జరిమానా విధించారు.





ఈనాడు సినిమా


కృతిశెట్టి


కీర్తి సురేశ్


కథానాయకుల నుంచి కొత్త కబురు వినిపించిందంటే చాలు.. ఆ తర్వాత సినీప్రియుల్లో మెదిలే తొలి ప్రశ్న 'మా హీరోతో జోడీ కట్టే సొగసరి ఎవరన్నదే'. దీనికి చిత్ర బృందాల నుంచి స్పష్టత వచ్చే లోపే బోలెడన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చి ప్రేక్షకుల్ని ఊరించే ప్రయత్నం చేస్తుంటాయి. ప్రస్తుతం ఇలాగే కొందరు హీరోల కొత్త చిత్రాలకు సంబంధించి పలువురు నాయికల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ప్రచారంలోకి వచ్చిన జంటలన్నీ తెరపై మురిపించాలని నియమం లేదు.

సన్నీ దేవోల్.. జాట్


సన్నీ దేవోల్

బాలీవుడ్ స్టార్ సన్నీ దేవోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రణదీప్ హుడా, సయామీ ఖేర్, రెజీనా తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'జాట్' అనే పేరును ఖరారు చేశారు. శనివారం సన్నీ దేవోల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో సన్నీ పెద్ద ఫ్యాన్‌ను చేతో పట్టుకుని యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా కనిపించారు. ఈ సినిమాని లార్జర్ దేన్ లైఫ్ యాక్షన్ డ్రామాగా భారీ హంగులతో ముస్తాబు చేస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దీని చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: రిషి పంజాబీ.

బజరంగ్‌బలితో బాజీరావ్ సింగమ్


రణ్‌వీర్ సింగ్

ఇతిహాసాల్లో గొప్పగా భావించే రామాయణానికి హీరోల యాక్షన్ హంగులద్దితే ఎలా ఉంటుందో చూపించడానికి వస్తోంది 'సింగం అగైన్'. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న చిత్రమిది. రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దీపికా పదుకొణె కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సింగం' ఫ్రాంఛైజీలో రూపొందుతున్న ఈ చిత్రంలో మరోసారి బాజీరావ్ సింగమ్‌గా సందడి చేయనున్నారు అజయ్. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఇందులోని మొదటి పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'జై బజరంగబలి..' అంటూ సాగుతున్న ఈ గీతంలో రాముడిగా అజయ్, హనుమాన్‌లా రణ్‌వీర్ పాత్రల్ని, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని చూపించారు. హనుమాన్ చాలీసా నుంచి ప్రేరణ పొందిన ఈ ట్రాక్‌ను తమన్ కంపోజ్ చేశారు.

ప్రచార ఊరింపేనా.. జంటగా మురిపించేనా!

కథానాయకుడు ఎన్టీఆర్ వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'వార్ 2'తో పాటు ప్రశాంత్‌నీల్ సినిమా ఒకటుంది. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) చిత్రం వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీనికోసం తారక్ జనవరి నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నారు. అయితే ఇప్పటికీ చిత్ర బృందం ఇందులో కథానాయిక ఎవరన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈ ప్రాజెక్ట్ కోసం మొదట్లో రష్మిక పేరు వినిపించినప్పటికీ ఇప్పుడు రుక్మిణీ వసంత్‌ను పరిశీలనలో ఉంచినట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. యువ హీరో విష్వక్ సేన్ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పుడాయన చేయనున్న కొత్త సినిమాల్లో 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ చిత్రమొకటి ఉంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడిందులో నాయికగా కృతిశెట్టిని సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. కృతి సానుకూలంగా స్పందించిందని తెలిసింది.


రుక్మిణి
శ్రద్ధా కపూర్

కాంబో కుదిరిందా?

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కానీ, దీని తర్వాత ఆయన చేయనున్న కొత్త చిత్రమేదన్నది ఇంకా తేలలేదు. అయితే త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'అర్జున్ సురవరం'తో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన టి.ఎన్. సంతోశ్.. ఇప్పుడు వెంకీతో ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. కథానాయిక కీర్తి సురేశ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నట్లు వార్తలు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్టను నితిన్ సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది.

ముణ్నాభాయ్ 3 సన్నాహాలు



మరిన్ని విశేషాలు https://epaper.eenadu.net లో

బతుకే నటన

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రిషికేశ్వర్ యోగి తెరకెక్కించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధు రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. హీరో సుధీర్‌బాబు, దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తదితరులు అతిథులుగా హాజరయ్యారు. "ఈ సినిమాని అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరుతున్నా" అన్నారు దర్శకుడు రిషికేశ్వర్.


సింధు, సుధీర్‌బాబు, విశ్వప్రసాద్, రిషికేశ్వర్, శివ

సైన్స్‌కు అతీంద్రియ శక్తులు కలిస్తే.. శంబాల


ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ తన రాబోయే సినిమా కోసం సైంటిస్ట్ అవతారమెత్తారు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో 'శంబాల' అనే చిత్రంలో నటిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో యుగంధర్ ముని దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆనంది కథానాయిక. శనివారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "అతీంద్రియ శక్తులకు సైన్స్ కలిస్తే.. ఆ నిజం కల్పితాల కంటే భయంకరంగా ఉంటుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. దీన్ని షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రాజశేఖర్, మహిధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఓ యువకుడి జీవితం స్ఫూర్తితో!


అనన్య, రాకేశ్

రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి తెరకెక్కించారు. అనన్య కృష్ణన్ కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. నటి అనసూయ, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరయ్యారు. హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ.. "బంజారా వర్గానికి చెందిన ఓ యువకుడి నిజ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాని తెరకెక్కించాం" అన్నారు దర్శకుడు అంజి.

టిట్ల తర్వాత పటేల్ పాత్రతో ఆ మ్యాజిక్


అజయ్

ప్రతినాయకుడిగా.. సహాయనటుడిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు అజయ్. ఇప్పుడాయన ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని సాహిత్ మోత్ఖూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అజయ్.

★ "ఇది భిన్న కోణాలున్న కథ. పూర్తిగా 1980ల నాటి తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఓ చిన్న పాప చదువు కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. అలాగే మూఢనమ్మకాలు.. వాటిని అడ్డుపెట్టుకుని బతికే మనుషులు.. మొండితనం.. గ్రామదేవతలు.. ఇలా చాలా కోణాల్ని ఈ కథలో స్పృశించారు దర్శకుడు సాహిత్".

★ "ఈ చిత్ర విషయంలో నాకు సవాల్‌గా అనిపించింది ఈ కథలోని సంస్కృతిని సహజంగా తెరపైకి తీసుకురావడమే. దీంట్లో నేను పటేల్‌గా ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపిస్తా. కొన్ని సీన్స్‌లో చీరకట్టులో కనిపిస్తా. తెలంగాణలో సిగం (దేవుడు పూనడం) అని ఉంటుంది. అది వచ్చినప్పుడు ఆ వ్యక్తులు మాట్లాడే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర చేసేటప్పుడు దాని మీద కొంత హోంవర్క్ చేశా. నేను చేసిన సినిమాల్లో 'విక్రమార్కుడు'లోని టిట్ల పాత్ర నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత అలాంటి పాత్రలు కొన్ని ప్రయత్నించినా ఆ మ్యాజిక్ మళ్లీ కుదర్లేదు. కానీ, ఈ సినిమా ఆ లోటు తీరుస్తుందనిపిస్తోంది. నటుడిగా నాకెంతో ఆనందాన్నిచ్చిన పాత్రిది".

★ "ఈ చిత్రసీమలో 25 ఏళ్లుగా నటుడిగా ఉండగలగడం మామూలు విషయం కాదు. ఇన్నేళ్లు ఇక్కడ నిలకడగా కొనసాగడమే నా వరకు పెద్ద గిఫ్ట్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 250 సినిమాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. ఈ ఏడాది నాకు 'దేవర', 'మత్తువదలరా 2' లాంటి రెండు పెద్ద విజయాలు దక్కాయి. ఇటీవలే నేను 'సింగం అగైన్' చేశాను. 'పుష్ప 2', 'గరుడన్' తెలుగు రీమేక్ తదితర చిత్రాలు చేస్తున్నా".


ఎంపికైన ఉమ్మడి జిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టు

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని డీవైఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. పుత్తూరులోని బీఎస్ క్రికెట్ అకాడెమీలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాలబాలికల క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు నవంబరులో గుంటూరులో జరిగే అండర్-17 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, తెదేపా జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శరత్, తెదేపా పట్టణ అధ్యక్షుడు జీవరత్నం, బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆర్గనైజర్ శ్రీనివాసులు, బీఆర్ మురళి, బీఆర్ హేమాద్రి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.


ఎంపికైన అండర్-17 జట్టు

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని మెసానికల్ మైదానంలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆటగాళ్లు ఎంపిక పోటీలకు తరలి వచ్చారు. నిర్వాహకులు తుది జట్లు ఖరారు చేశారు. అండర్-17 జట్లు ఈ నెల 26 నుంచి 28 వరకు పశ్చిమగోదావరిలో, అండర్-14 జట్లు నవంబరు 3 నుంచి 5 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే పోటీల్లో తలపడనున్నారు. బాస్కెట్‌బాల్ సంఘం నాయకులు జయప్రకాష్‌నాయుడు, పీడీ బాబు, లక్ష్మీపతినాయుడు, కృష్ణమూర్తి, కుమార్, జేమ్స్, నాగరాజు, అజీమ్, గిరిజ, ఉషారాణి పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన చిత్తూరు జిల్లా బాలుర జట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు..

చౌడేపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలకు శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో చిత్తూరు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంత వాణి తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని క్రీడాకారుల బృందాలు పోటీపడ్డాయి.

చదరంగం, టెన్నిస్ జిల్లా జట్లు..

తిరుపతి(క్రీడలు): స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 చదరంగం, టెన్నిస్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్‌గేమ్స్ సమాఖ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా శనివారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారిని ఎంపిక చేశారు. త్వరలో కాకినాడ వేదికగా టెన్నిస్, కర్నూలు వేదికగా చదరంగం రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు ఆయన వివరించారు.

మహిళామణులు..

ఆర్థిక ప్రగతి దిశగా అతివలు



చిత్తూరు జిల్లా వార్తలు

నాడు మహిళలు వంట పనులు ముగించుకున్నాక చిన్నాచితకా పనులు చేసి తమ అవసరాలకు సంపాదించుకునే వారు. నేడు ఆ పరిస్థితి మారింది. తమకు తెలిసిన పనుల్లో మెలకువలు నేర్చుకుని నేడు వ్యాపారాలు సాగించి రూ.లక్షలు ఆర్జించి మహిళా సంఘాల్లోని మహిళలు ఆర్థిక ప్రగతి దిశగా సాగుతున్నారు. ఎదుటి వారికి అప్పులు ఇచ్చే స్థాయికి ఎదిగారు. రాస్ సహకారంతో తాము చేసిన పొదుపు సొమ్ముతో కలిపి బ్యాంకు రుణాలు పొంది తమ వ్యాపారాలు విస్తరించుకుంటూ ఆర్థికంగా బలపడి పదుగురికి ఆదర్శంగా నిలిచారు పుత్తూరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు. న్యూస్‌టుడే, పుత్తూరు

ఆర్యా వర్క్స్‌తో..



పుత్తూరు పట్టణం బెస్తవీధికి చెందిన జయసుధ పనుల్లేక ఇబ్బందులు పడేవారు. 2008లో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరి పొదుపు ప్రారంభించారు. ఆపై ఆర్యా వర్క్ నేర్చుకున్నారు. బ్యాంకులో రూ. 4.5 లక్షలు రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుతం ఆమె అన్ని ఖర్చులు పోను నెలకు రూ. 25 వేలు ఆదాయం ఆర్జిస్తున్నారు. మరో ఇద్దరికి ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు ఆర్థిక సమస్య లేకుండా ఆనందంగా కుటుంబం సాగిపోతోందని జయసుధ పేర్కొన్నారు.

కట్టెల బ్యాగుల తయారీతో..



గేటుపుత్తూరులోని గుండ్లపుత్తూరుకు చెందిన చంద్రశేఖర్, శివపూర్ణ భార్యభర్తలు. కూలీకి వెళ్తే గానీ పూట గడవని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారు. శివపూర్ణ రాస్ సంఘంలో సభ్యురాలిగా చేరారు. కూలీ చేసి పొదుపు చేశారు. టైలరింగ్ నేర్చుకుని చిన్నచిన్న పనులు చేసేవారు. అనంతరం బ్యాంకులో రుణం పొంది కట్టెల బ్యాగుల తయారీ మొదలుపెట్టారు. తద్వారా ఆమె ఆదాయం రెట్టింపైంది. తీసుకున్న రుణం సకాలంలో చెల్లించడంతో ఆమెకు బ్యాంకు అధికారులు కట్టెల బ్యాగుల తయారీ యంత్రం కొనుగోలుకు రుణం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె తయారు చేసిన కట్టెల బ్యాగులు పుత్తూరు, తిరుపతి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ నెలకు రూ. 20 వేలు సంపాదిస్తూ ఆర్థికంగా ఎదిగారు. ప్రస్తుతం ఆనందంగా జీవిస్తున్నామని, ఎలాంటి ఇబ్బందులు లేవని, పొదుపే తనను ఆదుకుందని ఆమె పేర్కొన్నారు.

సాగుకు.. కూలీల కరవు

కలగా వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం


కలుపు తీస్తున్న మహిళ కూలీలు(పాత చిత్రం)

నగరి, న్యూస్‌టుడే: ఆధునిక సాగు, సాంకేతిక విధానం, బిందు సేద్యం, తుంపర్ల సేద్యం అంటూ ప్రోత్సాహం అందించే ప్రభుత్వం, వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం కూలీలను అనుసంధానం చేయాలనే అంశంపై దృష్టిపెట్టలేదు. క్షేత్ర స్థాయిలో సాధారణ రైతులకు గ్రామంలో ఉన్న వ్యవసాయ కూలీలు అందుబాటులో లేకపోవడం ఓ పెద్ద సమస్యగా మారుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు ఏడాదికి వందరోజులు పని కల్పించే పథకం అన్ని గ్రామాల్లో అమలు చేయడం ద్వారా కూలీలకు ఉపాధి దొరుకుతుంది. వారినే నమ్ముకున్న రైతులకు పొలాల్లో పనిచేసే వారు కరవౌతున్నారనేది వాస్తవం.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం.. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతుందంటే కారణం కూలీల కొరత. ఆహార ధాన్యాలు పండించే భూములు ఉద్యాన తోటలుగా మారుతున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్దేశం మంచిదైనా, కొన్ని ప్రాంతాల్లో ప్రధానంగా జిల్లాలో నిత్యం వ్యవసాయ పనులు జరిగే తూర్పు మండలాల్లో కూలీల కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా చెరకు, వరి, వేరుసెనగ, కూరగాయలు, పూలతోటలతో ఏడాది పొడవునా పంటలు పండించే నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వ్యవసాయానికి కూలీలు లేక భూములు బీడుగా మారుతున్నాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది.

యంత్రాలతో కుదరక.. వ్యవసాయం అంటే చిన్న, సన్నకారు రైతులు కూలీలపైనే ఆధారపడతారు. నాట్లు, కలుపు, కూరగాయలు, పూలతోటలలో పనులకు కూలీలు అవసరం. ఏడాదిలో వంద రోజులు ఉపాధి పనులు ఉంటాయి. మిగిలిన రోజుల్లోనే సాగు పనులకు కూలీలు వస్తారు. అదునులో కూలీల కొరత తీవ్రంగా ఉందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 2,59,963 మంది కూలీలు ఉపాధి హామీ కింద నమోదు చేసుకున్నారు. వీరిలో యాక్టివ్ జాబ్ కార్డులుండి పనిచేసే కూలీలు 2,07,303 మందే. మిగిలిన వారందరూ వ్యవసాయానికి దూరమైనట్లే. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే ఈ సమస్య గట్టెక్కవచ్చని రైతులు కోరుతున్నారు.

చోరీ నగలు లభ్యం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వాముల మహిమతోనే నాలుగు నెలల కిందట చోరీ అయిన 62 గ్రాముల బంగారు నగలు, రూ. 25వేల నగదు లభ్యమైందని బాధితుడు సి. అజయ్ బాబు శనివారం తెలిపారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి సమీపంలోని చెరుకువారిపల్లెకు చెందిన ఆయన ఇంట్లో నాలుగు నెలల కిందట చోరీ జరిగింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో గ్రామంలోని అనుమానితులతో చౌడేపల్లె మండలంలోని రాజనాల బండకు తీసుకొచ్చి సత్య ప్రమాణం చేయించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు కిందట బాధితుడి ఇంటి ఆవరణలో చోరీ చేసిన నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయని బాధితుడు తెలిపారు. శనివారం ఆలయానికి నగలు, నగదు, తీసుకొచ్చి స్వామివారి పాదాలు చెంత పెట్టి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత రిజిస్ట్రేషన్



విశ్వబ్రాహ్మణ కుల అవివాహితులకు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని 'ఈనాడు' కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లి పందిరిలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న సంబంధిత కుటుంబీకులు ఆదివారం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 91547 72006, 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానీయవద్దు

శ్రీకాళహస్తి: కార్తిక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తనీయకుండా చర్యలు చేపట్టాలని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సూచించారు. ఈ విషయమై శనివారం ఆలయ పరిపాలన భవనంలోని సమావేశపు హాలులో ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్‌తో కలసి వైదిక కమిటీ, అధికారులతో సమావేశమయ్యారు. కార్తిక మాసం ప్రారంభమయ్యేలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్తిక దీపాలు వెలిగించుకునేందుకు షెడ్లు, స్నానఘట్టాల అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణ, కార్తిక దీపోత్సవాల ఏర్పాట్లు తదితరాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఈవో ఎన్. ఆర్. కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పోయేది విద్యార్థులేగా..

ప్రమాదకర స్థితిలో బాలికల వసతిగృహం


మోల్డింగ్ నుంచి ఊడిపడిన పెచ్చులు


నిద్రించే గదిలో ఫ్యాన్ లేక..

గుడిపాల, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ బాలికల వసతి భవనం పైకప్పు దెబ్బతిని పెచ్చులూడి పడుతోంది. దీంతో వారికి ప్రమాదం పొంచి ఉంది. వర్షం వస్తే గదుల్లో నీరు నిలుస్తోంది. ఈ వసతి గృహంలోని 38 మంది విద్యార్థులు ఒకే గదిలో నిద్రిస్తున్నారు. ఫ్యాన్‌లు సరిగా పనిచేయడం లేదు. దీంతో వారు సరిగా నిద్రించలేకున్నారు. నిత్యం పైనుంచి పెచ్చులు ఊడి బాలికల తలలపై పడే ప్రమాదం ఉంది. సెప్టిక్ ట్యాంక్ దెబ్బతినడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్లలో అపరిశుభ్రత నెలకొంది. వాటి తలుపులకు రంధ్రాలు ఏర్పడ్డాయి. భవనంపై ఉన్న తాగునీటి ట్యాంకు దెబ్బతిని శుభ్రమైన తాగునీరు అందడం లేదు. వీటికితోడు వానరుల గుంపు అక్కడ తిష్ఠ వేశాయి. అజాగ్రత్తగా ఉంటే గదుల్లోకి ప్రవేశించి పిల్లల తినుబండారాలు, దుస్తులు, పుస్తకాలు చింపేస్తున్నాయి. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ రోజులు నెట్టుకొస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం.. ఇటీవల వసతి భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేయడానికి నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులను చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం. **-శివరాజు, ఎంపీడీవో, గుడిపాల**

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

ఆధునిక పద్ధతులతో ఖర్చులు తగ్గించాలి



డ్రోన్ పనితీరును రైతులకు వివరిస్తున్న ఏవో ఫయాజ్

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నూతన సాంకేతిక పరిజ్ఞానం, పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా సాగు చేపట్టాలని ఏవో ఫయాజ్ రైతులకు సూచించారు. మండలంలోని చంద్రమాకుపల్లెలో శనివారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు డ్రోన్ పనితీరు గురించి వివరించారు. సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పర్యటిస్తా

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సామాజిక సేవకర్త గణేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని లక్కనపల్లె, తీర్థం, దాసార్లపల్లె గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని షిర్డీసాయినగర్‌లో వీధి దీపం వెలగడం లేదు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు అధికంగా ఉంటున్నాయి. వీధి దీపం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. **- రమణారెడ్డి, షిర్డీసాయినగర్**

సమాధానం: 24 గంటల్లో వీధి దీపం మరమ్మతు చేస్తాం. **- మధుసూదనరెడ్డి, పుర కమిషనరు**

సమస్య: పట్టణంలోని నారప్పకాలనీలో ప్రధాన మార్గం బురదమయమైంది. సీసీ రోడ్డు వేయకపోవడం, ఎడతెరిపి లేని వర్షం కారణంగా మట్టి మార్గం బురదమయమైంది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

- రఘునాథరెడ్డి, గోకుల్‌వీధి

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు చేపడతాం. సీసీ రోడ్డు కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. **- మహేష్, డీఈఈ, పురపాలక సంఘం**

పలమనేరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో రోడ్లపై గుంతలు ఉండటంతో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- అష్వాదిబాషా, పలమనేరు

సమాధానం: గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం. **- ఎన్వీరమణారెడ్డి, పుర కమిషనర్, పలమనేరు**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వెనుక భాగంలో ఉన్న మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగునీరు ప్రవహించక దుర్వాసన వస్తోంది. **- ఆదిత్య, కుప్పం**

సమాధానం: కాలువలో వ్యర్థాలు తొలగించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. **- శ్రీనివాసరావు, పుర కమిషనర్**

చార్జీల వసూళ్లపై దృష్టి పెట్టాలి



ఎస్‌ఈకి జ్ఞాపికను అందజేస్తున్న ఈఈ, ఏడీఈలు

పుంగనూరు, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఛార్జీల వసూళ్లపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యుత్తుశాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఈఈ కార్యాలయంలో ఏడీఈ, ఏఈలతో సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్తు ప్రమాదాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌ఈని అధికారులు సత్కరించారు. ఈఈలు శ్రీనివాసమూర్తి, జగదీష్, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు శశిధర్, మహేంద్రరెడ్డి, ధనుంజయమూర్తి, రమణ పాల్గొన్నారు.

ఎస్సైకి అభినందనలు



ఎస్సై పరశురాముడును అభినందిస్తున్న ఎస్సీ సంఘం నాయకులు

బైరెడ్డిపల్లె: నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పరశురాముడును మండల ఎస్సీ సంఘం నాయకులు శనివారం అభినందించారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. సంఘం నాయకులు బి.ఓ.సుబ్రహ్మణ్యం, చలపతి, బాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాయుగుండం కరుణించక.. చెరువుల్లో నీరు చేరక



చుక్క నీరు లేక ఎండిన కుప్పం చెరువు

వాడు ముఖం పట్టిన వేరుసెనగ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అసలే ఎలాంటి నీటి ప్రాజెక్టులు లేవు.. పూర్తిగా వర్షాలపైనే ఆధారపడిన ప్రాంతం.. పొరుగు కర్ణాటక ప్రాంతాల్లోని చెరువు పొంగితేనే ఇక్కడి చెరువు నిండుతుంది. గత సంవత్సరం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో ఉన్న కొద్దిగొప్పో నీరు సైతం అడుగంటే స్థాయికి చేరుకుంది. దీంతో తాగు, సాగునీరుకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి.. వైకాపా ప్రభుత్వంలో కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలాన్ని మాత్రమే కరవు మండలముగా ప్రకటించారు. ఈ ఏడాది ఆటు కర్ణాటక, ఇటు ఆంధ్రాలోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ జలకళ లేక ఎండుతున్నాయి. కుప్పం నియోజకవర్గంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ శాతం నమోదైంది. కనీసం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతోనైనా చెరువులు నిండుతాయని అనుకున్నా.. చిన్నపాటి చినుకులతోనే సరిపెట్టడంతో ఆశలు ఆడియాసలయ్యాయి.

అలుముకుంటున్న కరవు ఛాయలు..

కుప్పం నియోజకవర్గంలో 565 చెరువులు ఉండగా, వీటిలో సగానికిపైగా చెరువుల్లో నీటి మట్టం తగ్గింది. నియోజకవర్గంలో ప్రతి ఏటా సాధారణ వర్షపాతం 542 మి.మీ నమోదు కావాల్సి ఉండగా.. ఈ ఏడాది 432.9 మి.మీ. మాత్రమే కురిసింది. 6405 హెక్టార్ల వ్యవసాయ భూములకు 2886 హెక్టార్లలో మాత్రమే వేరుసెనగ సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబరులో వర్షాలు కురవకపోవడంతో దాదాపు 70 శాతం పంట నష్టం చవిచూడాల్సి వచ్చింది. సాధారణంగా ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల వేరుసెనగ దిగుబడి రావాల్సి ఉండగా, ఈ ఏడు ఎకరాకు 1.5 క్వింటాళ్లు వచ్చిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

తాగునీటికి ఇక్కట్లు

పురపాలక పరిధిలోనే కాకుండా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో తాగునీటి సమస్య ఇప్పుడిప్పుడే మొదలైంది. పురపాలక పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, సామగుట్టపల్లె, దళవాయికొత్తపల్లె, అర్బన్ కాలనీ, అమరావతి కాలనీ, మోడల్ కాలనీ, నారాయణపురం తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది.

ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం

పురపాలక పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. నీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తాం. **- శ్రీనివాసరావు, పుర కమిషనర్**

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ




▸ పరీక్ష రాస్తున్న విద్యార్థులు ▸ బహుమతులు అందుకున్న విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిమేధ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. శనివారం 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఇంటర్ నెట్ వినియోగం, సామాజిక మాధ్యమం విద్యార్థులపై చూపించే ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో 9వ తరగతి చదువుతున్న నిత్యశ్రీ ప్రథమ, ఎస్.సుహేల్ తృతీయ బహుమతి అందుకున్నారు. పదో తరగతి చదువుతున్న ఆయాన్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ గిరిధరమూర్తి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పీవీకేఎన్ కళాశాల మైదానంలో బాణసంచా విక్రయాలు

చిత్తూరు కలెక్టరేట్: దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయాలకు చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ మైదానాన్ని వేదికగా ఖరారు చేశామని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విక్రయాల నిమిత్తం ప్రజల సౌకర్యార్థం పీవీకేఎన్ కళాశాల మైదానాన్ని ఎంపిక చేశామన్నారు.

పాలెంపల్లెలో పారిశుద్ధ్య చర్యలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పాలెంపల్లె పంచాయతీ కేంద్రంలో శనివారం పాఠశాల ఆవరణ, మురుగు కాలువల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ నెల 14న ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించినట్లు కార్యదర్శి నాగేంద్రనాయక్ తెలిపారు.

స్పందనకు వందనం

చెత్త తొలగింపు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కేజీఎఫ్ మార్గం నుంచి అరిముత్తనపల్లె సీసీ రహదారిలో చెత్త దిబ్బలు నిల్వ ఉండటంతో 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' .. శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి ఏవీ జయరామ్, కార్యదర్శి అశ్వర్థనారాయణ చెత్త దిబ్బల నిల్వల తొలగింపునకు చర్యలు చేపట్టారు.



మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో ప్రయాణికులు తలదాచుకునే చోటు కరవైంది. ఎండైనా..వానైనా ప్రయాణికులు రోడ్డుపై పడిగాపులు కాయాల్సిందే. స్థానిక నాలుగురోడ్ల కూడలి, ఇండియన్ బ్యాంకు కూడలి వద్ద బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు ఇలా రోడ్లపై ఉండాల్సిందే. బస్ షెల్టర్ లేకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి విద్యార్థులు ఇలా తడిసి ముద్దయ్యారు.

- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె



మండల పరిధి చలమంగళం గ్రామానికి వెళ్లే తారురోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 20ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు ఇప్పుడు పూర్తిగా రూపురేఖలు మారిపోయింది. పెద్దపెద్ద గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. వృద్ధులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి



పుంగనూరు-తిరుపతి మార్గంలో భగత్ సింగ్ కాలనీ, చదళ్ల, గొల్లపల్లె గ్రామాల వద్ద ప్రధాన రహదారి గోతులమయమైంది. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. ముఖ్యంగా బోయకొండ గంగమ్మ ఆలయానికి కర్ణాటక నుంచి వచ్చే వందలాది వాహనాలు ఈ మార్గంలోనే వెళ్లాలి. పలుచోట్ల గోతులు పడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మరమ్మతులు చేసినా మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు



చిరుజల్లులు కురిసిన వేళ విరిసిన హరివిల్లుతో ఆకాశం మురిసింది. నీలాకాశంలో నల్లని మేఘాలపై ఏర్పడిన ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. బైరెడ్డిపల్లె మండలం శెట్టిపల్లె వద్ద శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిసిన సమయంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది. **- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె**

విద్యుత్తు కోతలపై రోడ్డెక్కిన జనం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: అడవిబూదుగూరు సబ్‌స్టేషన్ పరిధి కొట్టాలూరు, గుండ్లమడుగు తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆగ్రహించిన జనం శనివారం రాత్రి అడవిబూదుగూరు సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న రెస్కో అధికారులు రాత్రి 7 గంటలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడంతో నిరసన విరమించారు.

ప్రసాదాల పంపిణీ

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో తితిదే అధీనంలోని కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు ఆధ్వర్యంలో శనివారం ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ప్రసాదాలు వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు.

సతత వైద్య విద్యపై కార్యశాల

కుప్పం, న్యూస్‌టుడే: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాలలో సతత వైద్య విద్యపై కార్యశాల (వర్క్‌షాపు)ను శనివారం ఏర్పాటు చేశారు. జంతువుల కాట్లు, విష ప్రభావం, వైద్య సేవలపై పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూనోటిక్ వ్యాధుల నివారణపై వైద్య నిపుణులు, విద్యార్థులు చర్చాగోష్ఠిని నిర్వహించారు. ప్రిన్సిపల్ కృష్ణారావు, కమ్యూనిటీ వైద్య విభాగం అధిపతి చిత్రా నాగరాజన్ పాల్గొన్నారు.





▸ పెద్దపంజాణి: రాజుపల్లెలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు ▸ పుంగనూరు: పత్రపల్లెలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి ▸ శాంతిపురం: సభలో ప్రసంగిస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలుగు యువత మాజీ జిల్లా ప్రధానకార్యదర్శి భానుప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. 'పల్లె పండుగ'లో భాగంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సహకారంతో రూ.5.5లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు.

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని పత్రపల్లెలో సీసీ రోడ్డు పనులకు తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో లీలామాధవి, ఏపీవో శ్రీనివాసులు, కూటమి నాయకులు రమణ, మోహన్‌రెడ్డి, గంగాధరం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శాంతిపురం, న్యూస్‌టుడే: సామాజిక ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. అనికెర, 121-పెద్దూరు, కోనేరుకుప్పం, రేగడదిన్నెపల్లె పంచాయతీల్లో 'పల్లె పండగ' అభివృద్ధి పనుల భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో కుమార్, మండల తెదేపా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విశ్వనాథనాయుడు, నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



వంటను పరిశీలిస్తున్న జడ్జి లిఖిత

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తనిఖీ చేశారు. శనివారం విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని తయారు చేస్తున్న వంట గదిని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి బర్కత్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న కుప్పం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆరిఫా షేక్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా వసతి కల్పించాలని కుప్పం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆరిఫా షేక్ అన్నారు. పురపాలిక పరిధి పరసముద్రంలోని మామిడిపూడి నాగార్జున సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనాలు, గదులు, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ మల్లేశ్వరిని ఆదేశించారు.

సేవా దృక్పథానికి నిర్వచనం నర్సులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కుప్పం పట్టణం: అనారోగ్యంతో ఉన్న రోగిని తల్లిగా చూసుకుంటూ.. సేవకు నిర్వచనం నర్సులని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ నాగరాజ్ పేర్కొన్నారు. స్థానిక కుప్పం నర్సింగ్ కళాశాలలో దీపం వెలిగించి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థినులు నర్సింగ్ కోర్సు పూర్తైన తర్వాత నిబద్ధత, అంకిత భావంతో సేవ చేస్తామని కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డా.సునీల్‌రాజ్, కేసీ ఆస్పత్రి వైద్యుడు డా.బాలాజీ, కేఈసీ సీవో సాగర్‌రాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విమల జోసెఫ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్వకార సంఘం నాయకులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి సర్వకారుల సంఘం నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్వకారుల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరత్నం, శంకరాచారి, శివకుమార్, వెంకటరమణ, చలపతి పాల్గొన్నారు.

దాతకు సత్కారం



దాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన చిత్తూరు జిల్లా కబడ్డీ ఎంపిక పోటీలకు అవసరమైన నిధులు అందించిన మండలంలోని చుక్కావారిపల్లెకు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి కేసీ నవీన్ బాబును హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఎంఈవో కేశవరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పీడీలు వెంకటేష్, నితిన్, రాజేంద్ర, సురేష్, మధులత, నీలవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆకలి తిప్పలు



మార్కెట్ కమిటీ కార్యాలయం

పలమనేరు, న్యూస్‌టుడే: చేతికొచ్చిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చే రైతులకు సరైన భోజనం అందడం లేదు. మంచి భోజనం తినాలంటే ప్రైవేటు హోటళ్లను ఆశ్రయించాల్సిందేనని రైతులు చెబుతున్నారు. ఒక్క భోజనం రూ.70 తక్కువ లేకుండా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. పలమనేరు మార్కెట్ కమిటికి వచ్చే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరు మార్కెట్‌కు నిత్యం 5 వేల మంది రైతులు వస్తుంటారు. మార్కెట్‌లో రాయితీ భోజనం అందుబాటులో లేకపోవడంతో ఆవరణలోని ఓ ప్రైవేటు క్యాంటీను ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ నాసిరకం భోజనాలు, టిఫిన్లు సరఫరా చేస్తున్నారు. బయటి దుకాణాలకు వెళ్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇచ్చుకోలేక తప్పని పరిస్థితుల్లో ఇక్కడే భోజనం చేస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్ కమిటీలో అందుబాటులో ఉన్న భవనంలో క్యాంటీన్ ఏర్పాటు చేసి తక్కువ ధరకు నాణ్యమైన భోజనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్త మార్కెట్‌లో ఏర్పాటు చేస్తాం

ప్రస్తుతం మార్కెట్‌లో టీ కొట్టుతో పాటు క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. పశు పరిశోధనా కేంద్రం వద్ద నూతనంగా 30 ఎకరాల్లో నిర్మించనున్న ఆధునిక మార్కెట్ కమిటీ వద్ద క్యాంటీన్ ప్రతిపాదన ఉంది. అక్కడ అన్ని వసతులతో నిర్మాణాన్ని చేపడతాం.

- సంజీవ్‌కుమార్, కార్యదర్శి, మార్కెట్ కమిటీ, పలమనేరు

ఆలయాల్లో ఘనంగా పూజలు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని 81.ఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లె, ఆవులపల్లె, నంజంపేట, బురుజుపల్లె, సోమల, చింతలవారిపల్లె, మిట్టపల్లె కమ్మపల్లె తదితర గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: 13 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన మండలంలోని శెట్టిగానికురుబూరు మాజీ వాలంటీరు వెంకటాచలంను కఠినంగా శిక్షించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు షణ్ముగం డిమాండ్ చేశారు. మండలానికి చెందిన బాలికను వైకాపా నాయకుడి కుమారుడు, మాజీ వాలంటీరు బాలికను గర్భవతిని చేశాడన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు రజక సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ విషయమై డీఎస్పీకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీఆర్ మోహన్, రంగనాథ్, నరసింహులు, విశ్వ, మురళి, వెంకటాచలం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధుడి ఆత్మహత్య.. పలమనేరు: మండలంలోని కాలోపల్లె అడవిలో వెంకటేశన్(64) అనే వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పశువుల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వృద్ధుడు తమిళనాడులోని వేలూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మానసికస్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు.. కల్లూరు: పాడి ఆవులను అక్రమంగా తరలిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరి వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు కల్లూరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా పీలేరు నుంచి తమిళనాడులోని కాట్పాడికి వెళ్తున్న ఓ వాహనంలో రెండు ఆవులు, రెండు లేగదూడలు ఉండడాన్ని గుర్తించారు. కాట్పాడికి చెందిన పాడిఆవుల వ్యాపారి సద్దాం, వాహనం డ్రైవరు ముబారక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో ఆవులను కుక్కి ఉంచడంతో ఒక పాడి ఆవు మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూలిన బస్‌షెల్టర్‌పై గ్రామస్థుల అనుమానం.. నలగాంపల్లె(గుడుపల్లె): మండల పరిధి బెగ్గిలిపల్లె పంచాయతీ నలగాంపల్లె కూడలిలో బస్‌షెల్టర్ కూలడంపై విచారణ చేపట్టాలని గ్రామస్థులు ఆర్డీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో శనివారం పిర్యాదు చేశారు. స్థానికుల వివరాల మేరకు పలమనేరు-కుప్పం జాతీయ రహదారి మండల పరిధి నలగాంపల్లె కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం కుప్పం నియోజకవర్గ అభివృద్ధి నిధులతో 1990లో బస్‌షెల్టర్ నిర్మించారు. ఎదురుగా పీఈఎస్ మెడికల్ కళాశాల ఏర్పాటుతో భూ విలువలు అమాంతం పెరిగాయి. గతంలో బస్‌షెల్టర్ తొలగించే ప్రయత్నాలు చేయడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి షెల్టర్ పైకప్పు కూలిపోయింది. ఈ విషయమై గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.